## ఋణదా! శరధీ! కఋణాపయోనిధీ!

ఎవ్వనిచే జనించు ఋణ
మెవ్వనిచే భ్రమియించు లోకమం
దెవ్వని బుద్ధియే ఋణద
మెవ్వడు నవ్వుచు నప్పులిచ్చు దా
నివ్వగ జాలనం చనక
నివ్వగ జాలక, దిప్పనట్టి వా
డెవ్వడు— ఆ ఋణాత్మ, ఋణదేశ్వరు
నేను ఋణంబు వేడెదన్.

ఒక సూర్యుండు సమస్త జీవులకు
దా నొక్కొక్కడై తోచు న
ట్లొకటే రూక ధనమ్ముగా ఋణముగా
నొక్కొక్కచో శిక్షగా
నొకచో రక్షగ, లక్షగా, తృణముగా
నొక్కొక్కటై తోచగా
కొకటే సత్యము— ఒట్టిరూకసుడి !—
అప్పొప్పుల్ అపోహల్, భ్రమల్.

ఋణ ఋగ్వేదికి వాదికి
ఋణకారణ జన్ముడైన ఋణఖాదికి దా
ఋణబుద్ధికి ఋణసిద్ధికి
ఋణభ్రమాభ్రమరునకును ఋణికిన్ ఘృణికిన్

వ. ఋణాతరుణ వందన సహస్రం బాచరించి, నా యొనర్పం బూనిన శతక ప్రకారంబు .... ఒక్క నిముషం. ముందు నా మనవోటి వినండి. తరవాత అసలు విషయానికి రావచ్చు.

కబ్బము చేయుచుంటి నిది
కాగనె, యచ్చుకు బంపగానే, మా
సుబ్బయ డబ్బు పంపగనె—
సుబ్బయ తప్పక పంపులెమ్ము— నీ
డబ్బుల నిత్తుగాని, యొక డబ్బది—

ఈ యతివల్ల— నిమ్ము, లే
దబ్బ యనంగబోకు
ఋణదా! శరధీ! కఋణాపయోనిధీ!

అప్పులు చాల చేసితని యర్హత
లేదనబోకు లోకమం
దప్పులు తప్పులు న్నెరుగనేరని
వారెవరైన నుందురే !
అప్పులస్వామి యా వరుణు; డప్పుల
కుప్పలు మేఘవార్నిధుల్—
తప్పగునా ఋణంబు? ఋణదా!
శరధీ! కఋణాపయోనిధీ!

సాగరు ‘డప్పు’చేసి ఋణసాగరు
డైనను నిచ్చు వాహినుల్
నాగతి మూడవా! యనెడు
నాగటిచాలున కీవు; కావునన్
ఈగతి నప్పు, చేసితిని ఇమ్మిక
నమ్మిక నప్పు దాచినన్
దాగని దానశీల ఋణదా!
శరధీ! కఋణాపయోనిధీ!

'నాకడ నప్పు చేయుటగునా'
యని నవ్వుకొనంగబోకు మీ
లోకమునందు పారు నదులన్నిట
వార్నిధి యప్పుబీల్చగా
నా కడలి న్నగస్త్యముని యక్కట !
పుక్కిటబట్టి నిల్పలే
దా? కబుణాసముద్ర! ఋణదా!
శరధీ! కబుణాపయోనిధీ!

పూవుల నుండి తేటులును
పున్నమి చందురు నుండి కల్వలున్
గోవులనుండి వత్సములు
కోమలి మోవిని యాని కామియున్—
తావుల తేనె, వెన్నెలను,
తీయని పాలు, సుధారసంబులన్
ఏవిధి సస్రమంబుగ
గ్రహించెడి- నట్టుల నిప్పుడేను నీ
తావున నప్పుగొందు ఋణదా !
శరధీ! కబుణాపయోనిధీ!

(తమరు ఋణదానం చేసే పర్యంతం బండి కదలదు. ఋణగుణ ధ్వని చప్పున చల్లారిపోతుంది. గాన వెంటనే హో దేవా! తామీ విషయం బాలోచించ గలరు.)